# పార్లమెంట్ ఎన్నికలకు సర్వం సిద్ధం

- ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్
- కేంద్రాలకు తరలివెళ్లిన సిబ్బంది
- భద్రతను కట్టుదిట్టం చేసిన పోలీసులు

మహబూబ్‌నగర్‌లో పోలింగ్ సామగ్రితో కేంద్రాలకు బయలుదేరుతున్న సిబ్బంది

ఈవీఎంలను చెక్ చేసుకుంటున్న సిబ్బంది

మహబూబ్‌నగర్‌లోని బాలుర కళాశాల గ్రౌండ్‌లో ఈవీఎంల పంపిణీ కేంద్రం వద్ద ఎన్నికల సిబ్బంది

జడ్చర్ల, మే 12 : పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రవినాయక్ తెలిపారు. ఆదివారం జడ్చర్లలోని డాక్టర్ బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన ఎన్నికల డిస్ట్రిబ్యూటరీ సెంటర్‌ను ఎన్నికల పరిశీలకుడు షెవాంగ్ గ్యాచో భూటియా, కలెక్టర్ రవినాయక్, ఎస్పీ హర్షవర్ధన్, ఏఆర్‌వో మోహన్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా వీవీప్యాట్‌లు, ఈవీఎంలు, ఎన్నికల సామగ్రి అందరికీ అందిందా అని ఎన్నికల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జడ్చర్ల నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల సామగ్రిని, ఈవీఎం, వీవీప్యాట్‌లను ఎన్నికల అధికారులకు పంపిణీ చేశారు. జడ్చర్ల నియోజకవర్గంలో మొత్తం 2,22,838మంది ఓటర్లు ఉన్నారు. అందులో 1,11,053మంది పురుషులు, 1,11,779 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. మొత్తం 274 పోలింగ్ కేంద్రాలు, 30మంది సెక్టోరియల్ అధికారులను ఏర్పాటు చేశారు. ఒక్కో రూట్‌కు 8పోలింగ్‌స్టేషన్ల నుంచి 11పోలింగ్‌స్టేషన్లు ఉన్నాయి. పోలింగ్‌కు మొత్తం 274మంది పీవోలు, 274మంది ఏపీవోలు, 548మంది ఓపీవోలతోపాటు మరో 150మందిని అదనంగా ఏర్పాటు చేశారు. ఎన్నికల సిబ్బంది తమకు కెటాయించిన వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు.

### ఉదయం 7 నుంచి పోలింగ్

సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. ప్రతిపోలింగ్ స్టేషన్‌లో వెబ్ ద్వారా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఎన్నికల ప్రక్రియను పరిశీలించనున్నారు. అన్ని పోలింగ్ కేంద్రా ల వద్ద సిబ్బంది, ఓటర్లకు మంచినీటి వసతి, విద్యుత్, టాలెట్స్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించినట్లు నియోజకవర్గ ఎన్నికల ఏఆర్‌వో, అదనపు కలెక్టర్ మోహన్‌రావు తెలిపారు.

### భారీగా పోలీసు బందోబస్తు

నియోజకవర్గ వ్యాప్తంగా 144సెక్షన్ అమల్లో ఉంటుందని పోలీసులు తెలిపారు. మొత్తం 274 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. 48 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉండగా, అక్కడ అదనంగా పోలీసులను ఏర్పాటు చేశారు.

### భూత్పూర్ మండలంలో..

భూత్పూర్, మే 12 : పార్లమెంట్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తాసీల్దార్ రాజు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 46పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని.. ఒక్కో సెంటర్‌కు ఐదుగురు చొప్పున 230మంది అధికారులను నియమించామన్నారు. 38,697మంది ఓటుహక్కును వినియోగించుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

### నవాబ్‌పేటలో..

నవాబ్‌పేట, మే 12 : మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో పార్లమెంట్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తాసీల్దార్ నాన్యనాయక్ తెలిపారు. మొత్తం 53 పోలింగ్ కేంద్రాలకు గానూ 39,573 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. అన్నిపోలింగ్ కేంద్రాలకు ఆదివారం ఎన్నికల సిబ్బంది చేరుకున్నట్లు పేర్కొన్నారు. ఆయా కేంద్రాల్లో విద్యుత్, తాగునీటి వసతి సమకూర్చినట్లు తెలిపారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

### నారాయణపేటలో..

నారాయణపేట, మే 12 : జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ శ్రీహర్ష తెలిపారు. ఆదివారం దత్త బృందావన్ బీఈడీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. జిల్లాలోని నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాలకు గానూ రిజర్వ్‌తో కలుపుకొని 171 మంది సూక్ష్మ పరిశీలకులను కేటాయించినట్లు తెలిపారు. పేట నియోజకవర్గంలో 270, మక్తల్ నియోజకవర్గంలో 284 పోలింగ్ కేంద్రాలకు గానూ 2,624 మంది పోలింగ్ సిబ్బందిని కేటాయించామన్నారు. పేట నియోజకవర్గంలో 320 మంది ప్రిసైడింగ్ అధికారులు, 320 సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 640 మంది ఓపీవోలను నియమించామని, మక్తల్ నియోజకవర్గంలో 336 ప్రిసైడింగ్ అధికారులు, 336 సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 672 మంది ఓపీవోలను నియమించామని పేర్కొన్నారు. పేట నియోజకవర్గంలో మొత్తం 2,36,182 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 1,19,682 మంది మహిళ ఓటర్లు, 1,64,797 మంది పురుష ఓటర్లు, ముగ్గురు ఇతర ఓటర్లు ఉన్నారని తెలిపారు. మక్తల్ నియోజకవర్గంలో 2,44,173 మంది ఓటర్లు ఉండగా అం దులో 1,19,809 మంది మహిళ ఓటర్లు, 1,24,363 మంది పురుష ఓటర్లు, ఒకరు ఇతర ఓటరు ఉన్నట్లు తెలిపారు. పేట నియోజకవర్గంలో మొత్తం 270 పోలింగ్ స్టేషన్లకు 31 రూట్లను, మక్తల్ నియోజకవర్గంలో 284 పోలింగ్ స్టేషన్లకు 35 రూట్లను సిద్ధం చేశామన్నారు. హోం ఓటింగ్ కోసం పేట నియోజకవర్గంలో 33 మంది దరఖాస్తు చేసుకోగా 32 మంది, మక్తల్‌లో 8 మంది దరఖాస్తు చేసుకోగా 8 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోవడం జరిగిందన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. ఓటర్లను ఆకర్షించేందుకు పేట నియోజకవర్గంలో 5, మక్తల్‌లో 4 మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అంతేకాకుండా రెండు నియోజకవర్గాల్లో 2 యువ ఓటర్ల కేంద్రాలను, 2 దివ్యాంగుల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాలలో సీసీ కెమెరాలు, వెబ్ కెమెరాలు, అవసరమైన చోట వీడియో తీయించడం జరుగుతుందని పేర్కొన్నారు.

నారాయణపేటలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద సూచనలు చేస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

జడ్చర్లలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం వద్ద మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

నవాబ్‌పేటలో ఏర్పాటు చేసిన మహిళా పోలింగ్ కేంద్రం

జడ్చర్లలోని ఎన్నికల పంపిణీ కేంద్రం నుంచి సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది

మహబూబ్‌నగర్‌లోని బాలుర కళాశాల గ్రౌండ్‌లో ఎన్నికల సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న వాహనాలు

### దేవరకద్రలో..

దేవరకద్ర, మే 12 : నియోజకవర్గంలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో మొత్తం 289 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. విద్యుత్, బాత్‌రూంలు తదితర మౌలిక వసతులు కల్పించారు. నియోజకవర్గంలో ఐదు మాడల్ పోలింగ్ కేంద్రాలకు గానూ దేవరకద్రలోని 108, 109 కేంద్రాలను సుందరంగా ఆలంకరించారు. సోమవారం ఉదయం 7నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు.

### మక్తల్ నియోజకవర్గంలో..

ఊట్కూర్, మే 12 : పార్లమెంట్ ఎన్నికలను సజావుగా జరిపేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. సోమవారం జరిగే పోలింగ్ సందర్భంగా ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకున్నది. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటరు స్లిప్పులను పంపిణీ చేశారు. మక్తల్ నియోజకవర్గ వ్యాప్తంగా 284 పోలింగ్ కేంద్రాలు ఉండగా 2,44,173 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,24,363 మంది స్త్రీలు, 1,19,809 మంది పురుష ఓటర్లు, ఇతరులు ఒక్కరూ ఉన్నారు. దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రాల వద్ద వీల్ చైర్లను అందుబాటులో ఉంచారు. ఆదివారం ఆయా పోలింగ్ కేంద్రాలకు అధికారు లు చేరుకున్నారు. పోలింగ్ సందర్భంగా భద్రతను కట్టు దిట్టం చేసేందుకు నారాయణపేట జిల్లా ఎస్పీ యోగేశ్‌గౌతం పలు గ్రామాలను సందర్శించి ఏర్పాట్లు చేశారు. మక్తల్ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత చర్యలను తీసుకున్నారు.

### పటిష్ట భద్రత ఏర్పాటు చేశాం

మద్దూర్ (కొత్తపల్లి), మే 12 : ప్రతి పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేశామని ఎస్సై రామ్‌లాల్ ఆదివారం ప్రకటనలో అన్నారు. సోమవారం జరగబోయే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మద్దూర్, కొత్తపల్లి పరిధిలో 30 ప్రాంతాల్లో 62 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఆ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. అలాగే డీఎస్పీ అశోక్‌కుమార్, రాజు, ఇన్‌స్పెక్టర్, ఇద్దరు ఎస్సైలు, ఐటీబీపీ పోలీసులు, 30 మంది కర్ణాటకకు చెందిన పోలీసులు, 26 మంది స్థానిక పోలీసులతో బందోబస్తు చేశామని పేర్కొన్నారు.

## పటిష్ట బందోబస్తుకు చర్యలు

చింతకుంటలో పోలీస్ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్సై శేఖర్

దేవరకద్ర రూరల్(చిన్న చింతకుంట), మే 12 : సోమవారం పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ నిర్వహణ దృష్ట్యా అధికారులు ఏర్పాట్లు చేశారు. కాగా పోలింగ్ సమయంలో గ్రామాలు, పట్టణాల్లో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. చింతకుంటలో పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ప్రత్యేక పోలీస్ సిబ్బందికి ఎస్సై శేఖర్ పలు సూచనలు చేశారు.

పోలింగ్ కేంద్రానికి వచ్చే ప్రజలకు అసౌకర్యం కలుగకుండా క్యూలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు గుంపులుగా ఉండకుండా చర్యలు తీసుకోవాలని, ప్రశాంత వాతావరణంలో ఓటు వేసేలా చూడాలని సిబ్బందికి ఎస్సై సూచించారు.

మహబూబ్‌నగర్ నుంచి బస్సులో పోలింగ్ కేంద్రానికి వెళ్తున్న సిబ్బంది

దేవరకద్రలోని 109వ మాడల్ పోలింగ్ కేంద్రం

నారాయణపేటలో సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న ఎన్నికల సిబ్బంది

మహబూబ్‌నగర్‌లో స్ట్రాంగ్ రూం నుంచి ఈవీఎంలను తీసుకొస్తున్న సిబ్బంది

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

RECRUITMENT
★Pen, Pencil Company, Educated, Unemployed Girls/Boys, Male/Female, House Wife Earn 24500-64500 Packing Work at Home 9034548725, 9728230253
NT-3277

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

## రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

వ్యక్తి మృతదేహం

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, మే 12 : రోడ్డు ప్రమాదంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకున్నది. రూరల్ ఎస్సై విజయ్‌కుమార్ కథనం మేరకు మండలంలోని ఓబ్లాయిపల్లిలో శనివారం రాత్రి 10:30గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి (55) రోడ్డుపై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొన్ని అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటన స్థాలానికి మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ దవాఖాన మార్చరీకి తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

## కుప్పకూలిన ఇల్లు

- నలుగురికి స్వల్పగాయాలు
- తప్పిన ప్రమాదం

మరికల్, మే 12 : మరికల్ మండలం పుసల్‌పాడ్ గ్రామంలో ఆదివారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు ఇల్లు పైకప్పు కూలింది. ఇంట్లో ఉన్న నలుగురు చిన్నారులు బయటికి పరుగెత్తడంతో వారికి స్వల్పగాయాలయ్యాయి. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. పుసల్‌పాడ్ గ్రామానికి చెందిన సదాశివరెడ్డి తమ కుటుంబ సభ్యులతో పాత ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం ఈదురు గాలులు బలంగా వీచడంతో పాత ఇంటిముందు ఉన్న రేకులు గాలికి ఎగిరిపోవడంతోపాటు ఇల్లు కూడ కూలింది. ఇంట్లో ఉన్న చిన్నారులు నవశ్రీ, శ్రీనవ్య, సాయిసృతి, యశ్వంత్ రెడ్డిలు బయటకు పరుగెత్తడంతో వారికి స్వల్పగాయాలయ్యాయి. బాధిత కుటుంబాన్ని అదుకోవాలని గ్రామస్తులు కోరారు.

పూసల్‌పహాడ్‌లో కూలిపోయిన ఇల్లు

ప్రమాద సమయంలో ఇంట్లో నుంచి బయటికి పరుగెత్తి ప్రాణాలు కాపాడుకున్న చిన్నారులు

## అమ్మకు వందనం

మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం అన్నాసాగర్‌లో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తన తల్లి వరలక్ష్మి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ తల్లిదండ్రులను దైవంగా కొలవాలని కోరారు.
– భూత్పూర్, మే 12

## జిల్లాలపై స్పష్టతనివ్వాలి

- బీఆర్ఎస్ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నారాయణపేట, మే 12 : పార్లమెంట్ ఎన్నికల తర్వాత జిల్లాల కుదింపు ఉంటుందని, నారాయణపేటను జిల్లాల నుంచి తొలగిస్తున్నట్లు వస్తున్న వార్తా కథనాలపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు స్పష్టత నివ్వాలని బీఆర్ఎస్ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలపై కచ్చితమైన హామీ ఇవ్వాలని సవాల్ చేసి పక్షంరోజులు గడిచినా ఎలాంటి స్పందన లేదన్నారు. అలాగే అసెంబ్లీ ఎన్నికల సమయంలో తమ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే ఉగాది నాటికి గార్లపాడు, కాన్‌కుర్తి, కోటకొండ గ్రామాలను మండలాలుగా ఏర్పాటు చేస్తామని ప్రకటించారని, ఇప్పటివరకు వాటి ఊసే లేదన్నారు. పేట–కొడంగల్ ఎత్తిపోతల ద్వారా కోయిల్‌కొండ, ధన్వాడ, మరికల్ మండలాల్లో చుక్క నీరు కూడా రాదన్నారు. 80శాతం పూర్తయిన పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల కింద మిగిలిపోయిన కాల్వల తవ్వకాలు చేపడుతారో లేదో సమాధానం ఇవ్వాలన్నారు. మొదటిసారిగా జిల్లాకు వచ్చిన పీఎం మోదీ వరాల జల్లు కురిపిస్తాడనుకుంటే.. ఒక్క హామీ కూడా ఇవ్వలేదన్నారు. 2014 ఎన్నికల సమయంలో పాలమూరుకు వచ్చిన మోదీ.. పీఆర్ఎల్ఐకి జాతీయ హోదా కల్పిస్తామని హామీ ఇచ్చారని, కానీ ఇప్పటివరకు ఆ ప్రాజెక్టుపై నోటి వెంట మాట రావడం లేదన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రజలకు ఏం చేస్తామో చెప్పడం లేదని.. రాజకీయంగా లబ్ధి పొందేందుకు కులమతాలను అడ్డుపెట్టుకుంటున్నాయని మండిపడ్డారు.

## ఓటేయడం ప్రతిఒక్కరి బాధ్యత

- జిల్లా స్వీప్ నోడల్ అధికారి శ్రీధర్‌సుమన్

మాట్లాడుతున్న శ్రీధర్‌సుమన్

పాలమూరు, మే 12 : జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్, బస్టాండ్‌లో ఓటు హక్కుపై జిల్లా స్వీప్ నోడల్ అధికారి శ్రీధర్‌సుమన్ కళాజాత బృందంచే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఉత్సాహంగా పాల్గొని తప్పక తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. అదేవిధంగా ఎన్నికలల్లో ఓటింగ్ శాతాన్ని పెంచే లక్ష్యంతో రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనలు, కలెక్టర్ ఆదేశాల మేరకు బస్టాండ్, రైల్వే స్టేషన్‌ల్లో ఎన్నికల కౌంట్ డౌన్ కార్యక్రమాలు నిర్వహించడానికి జిల్లా స్వీప్ ప్రణాళిక నిర్ధారించబడిందన్నారు. అందులో భాగం గా మల్లికార్జున చౌరస్తాలో వీడియో ప్రదర్శనతో పాటు ప్రాంగణాల్లో కళాజాత బృందం వారిచే సాంస్కృతిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం శ్రీదేవి, డీఎం, సిబ్బంది, కళాజాత బృందం సభ్యులు, స్వీప్ నోడ్ అధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడి సస్పెన్షన్

పాలమూరు, మే 12 : ఎన్నికల విదుల్లో నిర్లక్ష్యం వ్యవహరించిన ఉపాధ్యాయుడిని కలెక్టర్ రవినాయక్ సస్పెండ్ చేసినట్లు ఆదివారం డీఈవో రవీందర్ తెలిపారు. బాలానగర్ మండలం నేరళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు రాము పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా తనకు కేటాయించిన ఎఫ్ఎస్‌టీ విధులను నిర్లక్ష్యం చేసినట్లు ఎన్నికల ఎక్స్పెంచర్ అబ్జర్వర్ అకస్మిక తనిఖీలో గుర్తించడంతో అదనపు కలెక్టర్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మో హన్‌రావు నివేదిక ప్రకారం ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు డీఈవో తెలిపారు.

## ఎన్నికలకు పకడ్బందీ బందోబస్తు

నారాయణపేట, మే 12 : పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు గానూ పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ యోగేశ్‌గౌతమ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా 1300 మంది పోలీసులతో భద్రతను ఏర్పాటు చేశామని, ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. సోషల్ మీడియాపై పూర్తి నిఘా ఏర్పాటు చేశామని, ఎన్నికలు సజావుగా జరిగేందుకు జిల్లా ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

## డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో నిర్వహణ లోపం

- సిబ్బందికి చాలీచాలని అన్నం, ఉడకని గుడ్లు
- ఇబ్బందులు పడ్డ ఎన్నికల అధికారులు

అచ్చంపేటరూరల్, మే 12 : పార్లమెంట్ ఎన్నికలకు ప్రభుత్వ యంత్రాంగం అంతా సిద్ధం చేసింది. అచ్చంపేటలోని వ్యవసాయ మార్కెట్‌లోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఎన్నికల అధికారులు, సిబ్బందికి పోలింగ్ సామగ్రిని అందజేశారు. అయితే సిబ్బంది కోసం అధికారులు మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశారు. కానీ నిర్వహణ లోపం కారణంగా సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఎన్నికల సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చాలిచాలని అన్నం అందులో సగం మాడిపోవడంతోపాటు ఉడికని గుడ్లు అందించడంతో చాలా వరకు సిబ్బంది భోజనం చేయకుండా వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ప్రత్యేకంగా మెనూను ఏర్పాటు చేసినా రెవెన్యూ అధికారుల నిర్వహణ లోపం కారణంగా సిబ్బంది అర్ధాకలితో పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయంపై నాగర్‌కర్నూల్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మాధవిని వివరణ కోరగా భోజన తయారీ విభాగానికి సంబంధించిన విధులు నిర్వహించిన సిబ్బందిపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఎవరికి వారే భోజనం వడ్డించుకుంటున్న ఎన్నికల సిబ్బంది

భోజనంతో పాటు తెచ్చిన ఉడికీ ఉడకని గుడ్లు